'హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం'

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 8: దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఎన్‌పీఆర్‌డీ సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్ ఆరోపించారు. మంగళవారం సుందరయ్య భవనంలో సంఘం జిల్లా బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ నెల 25న హైదరాబాద్‌లో నిర్వహించే దివ్యాంగుల సభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ ప్రభుత్వాల తీరుకు నిరసనగా ఉద్యమ కార్యాచరణతో పాటు భవిష్యత్తు పోరాటాలపై చర్చించేందుకు ఈ నెల 25న హైదరాబాద్‌లో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



దుర్గా దేవీ మండపాల్లో
వైభవంగా కుంకుమార్చనలు


అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

ఇచ్చోడ, అక్టోబరు, 8: దేవీ శరన్నవరాత్రి వేడుకలు మండలంలో వైభవంగా కొనసాగుతున్నాయి.. ఆరో రోజు అమ్మవారు విభిన్న రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని పలు మండపాల్లో ప్రత్యేక పూజలు, అన్న సమారాధన, సామూహిక కుంకుమార్చనలు, హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో నవరాత్రోత్సవాల్లో సందడి కొనసాగుతోంది. మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో మంగళవారం నిర్వహించిన సాముహిక కుంకుమార్చన కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతీరోజు నిర్వహించే అన్నప్రసాదాన్ని స్వీకరించి సాయంకాలం దాండియా, కొలాటాలు వేసి కాలనీవాసులంతా ఒక్క చోట చేరి ఆనందోత్సాహాల మధ్య నవరాత్రి వేడుకలను జరుపు కుంటున్నారు.

దుర్గాదేవి వద్ద కుంకుమ పూజ

బోథ్: మండలంలో దుర్గా శరన్నవరాత్రులు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. కౌటా(బి) గ్రామంలో శబరిమాత ఆశ్రమం వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవికి మహిళా భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కుంకుమ పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. వేద పండితులు పండరి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

అలరించిన భరతనాట్యం

మండల కేంద్రంలోని దుర్గా మండపం వద్ద సోమవారం అర్ధరాత్రి వరకు పట్టణానికి చెందిన వివిధ పాఠశాల విద్యార్థులు భరతనాట్యం చేసి ప్రేక్షకులను అలరించారు. దుర్గా కమిటీ వారు రోజుకో రీతిలో కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు.

జామిడిలో ఘనంగా కుంకుమార్చన

తాంసి: దుర్గా నవరాత్రులను పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో దేవి మండపాల ముందు మంగళవారం కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రమైన తాంసి, జామిడి, పొన్నారి, హస్నాపూర్ గ్రామాల్లో పెద్దఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచే ఆయా మండపాల వద్దకు మహిళలు మంగళ హారతులతో బయలుదేరారు. వేద పండితుల మంత్రాలతో దుర్గా, శారదా దేవీలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. ముందుగా హోమం నిర్వహించారు.









రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి
• ఎంపీ గోడం నగేష్

నేరడిగొండ, అక్టోబరు 8: రైతులను తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మోసం చేసిందని.. మోసానికి మరోపేరు కాంగ్రెస్ అని ఆదిలాబాద్ ఎంపీ గోడంనగేష్ విమర్శించారు. మంగళవారం మండలంలోని కోర్టికల్ గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ 2లక్షల రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికలప్పుడు దొంగ హామీనిచ్చి దొడ్డిదారిన డిసెంబర్ 9న గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరా కోతలు పెడుతు కేవలం 46శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తుందని, మొత్తం రుణమాఫీకి 31వేల కోట్ల రూపాయలు అవసరమని స్వయాన ముఖ్యమంత్రి చెప్పారని గుర్తు చేశారు. తీరా చూస్తే 17934 కోట్ల రూపాయల రుణమాఫీ చేసి రైతులను దగా చేస్తుందని దుయ్యబట్టారు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి షరతులు లేకుండా రేషన్‌కార్డును కాకుండా పట్టా పాస్ పుస్తకాన్ని ప్రామాణికంగా తీసుకొని రైతు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్య సమస్యలపై
వైద్యులను సంప్రదించాలి: ఎస్పీ

నార్నూర్, అక్టోబరు 8: గాదిగూడ మండలం సావిగ్రా గ్రామ పంచాయతీ పరిధిలోని ఝరి గ్రామంలో ఆదిలాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం మొదటగా లోకారి గ్రామంలోని కుమ్రంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామపెద్దల సమక్షంలో డప్పు వాయిద్యాల నడుమా జిల్లా ఎస్పీని ఘనంగా స్వాగతం పలికారు. ఈ వైద్యశిబిరంలో గాదిగూడ మండలంలోని దాదాపు 25 గ్రామంలోని 800 మంది ప్రజలు ఆదివాసీలు పాల్గొని వైద్య శిబిరాన్ని విజయవంతం చేశారు. ఈ మారుమూల గ్రామాల్లోని ప్రజలు ముఖ్యంగా గోండి, కోలాం, పర్ధాన్ లంబాడి, మహార్ వారు ఎక్కువగా పాల్గొనడం జరిగిందని తెలిపారు. వైద్య శిబిరంలో అమాయకులైన ఆదివాసీలకు అప్తమాలజీ, పీడీయాట్రిషన్, డెంటల్, సర్జరి, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, రేడియాలజీ, ఈఎన్‌టీ, కార్డియాలజీ వాటిల్లో వైద్య సేవలను ఉచితంగా అందించి మందులను అందజేశారు.

పేదలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బోథ్, అక్టోబరు 8: తాను ప్రజలకు అండగా ఉంటానని వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి ఎల్లవేళలా ఉంటుందని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వపరంగా మంజూరైన 43 మంది లబ్ధిదారులకు 12 లక్షల 57 వేల రూపాయల విలువైన చెక్కు లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు మధ్య తరగతి వారు అనారోగ్యం బారిన పడి ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటే ప్రభుత్వపరంగా మంజూరయ్యే సీఎంఆర్‌ఎఫ్ నిధులను మంజూరు చేయిచడం జరుగుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి తెలంగాణ ఆడబిడ్డలకు మేన మామగా నిలిచారన్నారు. అంతేగాక 14 లక్షల పెళ్లిళ్లకు కల్యా ణలక్ష్మీ చెక్కులను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చి హామీలు నెరవేర్చామని విమర్శించారు.


బోథ్‌లో కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

దశల వారీగా గ్రామాల అభివృద్ధికి నిధుల మంజూరు

మండలంలోని బాబేరా తండా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే జాదవ్ అనిల్ మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయన్నారు. అంతేగాక నియోజక వర్గంలో గ్రామాల అభివృద్ధికి గాను దశల వారీగా నిధులు మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కాగా ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘనంగా స్వాగతించారు. ముందుగా జగదాంబ దేవిసంత్ సేవాలాల్ మహారాజ్ భజరంగ్ బలి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఈ గ్రామానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ఆలయ నిర్మాణానికి 50 లక్షల రూపాయలు మంజూరు చేసిందన్న విషయాన్ని గుర్తు చేశారు. గ్రామానికి డబుల్ రోడ్డు నిర్మాణం అప్పటి ప్రభుత్వ సహాయంతో జరిగిందని పేర్కొన్నారు.




ఎయిర్‌ఫోర్స్‌డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ
మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం

యుద్ధ సమయంలో ఎయిర్‌ఫోర్స్ సేవలు ఎంతో అవసరం
• ఘనంగా ఎయిర్‌ఫోర్స్ డే

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 8: విపత్కర పరిస్థితులతో పాటు యుద్ధ సమయంలో ఎయిర్ ఫోర్స్ సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ డేను పురస్కరించుకొని సైనిక సంక్షేమశాఖ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ గౌస్‌ఆలం, యాపల్‌గూడ రెండవ బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్‌లతో కలిసి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి తినిపించారు. అదేవిధంగా ఇటీవల ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించిన చిన్నారి సాయి లోహిత్‌ను సత్కరించారు. అనంతరం ఆర్మీ కోటాలో ముగ్గురికి ఎంబీబీఎస్‌లో సీటు రావడంతో వారికి లెటర్లను అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ యుద్ధ సమయంలో ఎయిర్‌ఫోర్స్ సేవలు ఎంతో అవసరమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సైనిక సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, కెప్టెన్ మజర్, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

'దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి'

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబర్ 8: దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని దస్నాపూర్ మైదానంలో ఏర్పాటు చేయనున్న రావణ దహన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లకు మంగళవారం సమితి సభ్యులతో కలిసి భూమి పూజ చేశారు. దస్నాపూర్ మైదానంలో నిర్వహించే దసరా వేడుకలకు హిందూ బంధువులు వేలాది సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ప్రజలకు నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు హనుమాన్లు, శ్రీనివాస్, వేణుగోపాల్, మహేందర్, భరత్ రఘుపతి, లాలా మున్న, శ్రీనివాస్, ఆదిత్య, సంతోష్, దాము, సచిన్ సాయి పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

కష్టపడ్డారు .. అనుకున్నది సాధించారు

బోథ్, అక్టోబరు 8: ఉపాధ్యాయుల పోస్టులను సాధించడంలో బోథ్ మండల యువకులు కష్టపడి చదివి తమ సత్తా చాటుకున్నారు. బోథ్ మండల కేంద్రంలో 13, మంది సోనాలలో 9, కౌటా(బి)లో 5, పొచ్చెరలో 4, దన్నూర్‌లో మూడు, కుచ్చిలాపూర్‌లో ఇద్దరు ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సంపాదించి మండలం సత్తా చాటుకున్నారు. పట్టు వదలని విక్రమార్కులు కొంత మంది విద్యార్థినులు సంసారంలో ఉంటూనే తమ లక్ష్యాన్ని నెరవేర్చుకున్నారు.

'దన్నూర్ గ్రామాభివృద్ధికి కృషి చేస్తా'

బోథ్, అక్టోబరు 8: దన్నూర్ గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, అవసరమైతే రాష్ట్ర మంత్రులను బతిమిలాడి అయినా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ పేర్కొన్నారు. మంగళవారం గ్రామస్తుల కోరిక మేరకు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాలతో స్వాగతించి సన్మానించారు. అనంతరం గ్రామంలోని దుర్గామాత ఆలయానికి తీసుకువెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం ఆయన ఆలయ కమిటీ సభ్యుల విన్నపం మేరకు ఆలయ నిర్మాణానికి దేవాదాయ శాఖ నుంచి అధికంగా నిధులు వచ్చే విధంగా తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బిగంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పి.చంటి, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.వినయ్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షులు ప్రఫూలరెడ్డి, పోశెట్టి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ యల్ల ఇంద్రారెడ్డి, జక్కా మల్కన్నతో పాటు గ్రామస్తులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

తాంసి, అక్టోబరు 8: ఈ నెల 4వ తేదీన తాంసి సహకార సొసైటీలో కార్యదర్శిగా పని చేసే గణేష్ రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. అయితే ఆయన చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. తాంసి మండలకేంద్రంలోని సహకార సొసైటీ కార్యాలయంలో కొన్నేళ్లుగా కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి మోటార్స్ సైకిల్‌పై బయలు దేరాడు. ఖోడద గ్రామ సమీపంలో చెట్టుకు ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ఆయన పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. మృతిచెందిన గణేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాంసి పోలీసులు పేర్కొన్నారు.

కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలి
• రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 8: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసేలా యత్నాలు సాగిస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ ఆరోపించారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కార్మికుల పట్ల అనుసరిస్తున్న విధానాలపై చర్చించారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేట్ వారికి అప్పగించేలా కేంద్రం వ్యవహరిస్తుందన్నారు. ఈ కారణంగా కార్మికుల బతుకులు చిన్నాభిన్నం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేవేందర్, నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్ పాస్‌లు

బజార్‌హత్నూర్, అక్టోబరు 8: నేడు ఎంపీడీవో కార్యాలయంలో మండలం పరిధిలోని దివ్యాంగులకు ఉచిత బస్ పాస్‌లను ఆర్టీసీ సిబ్బంది ఇవ్వనున్నారని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం పరిధిలోని దివ్యాంగులు అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి
• మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15 వరకు రూ.2లక్షల పంట రుణాల మాఫీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. స్వయంగా దేశప్రధానికి సైతం తప్పుడు లేఖలు పంపుతున్నారని విమర్శించారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 20లక్షల మంది రైతులకు రుణమాఫీ జరగాల్సి ఉన్న ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. సీఎం స్థాయిలో ఉండి రైతులను మోసం చేయడంపై మండిపడ్డారు. రైతులను మోసం చేసిన ముఖ్యమంత్రి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని స్వయాన రాహుల్‌గాంధీ చెప్పిన ఇప్పటివరకు పట్టించుకోలేదన్నారు. అసత్య ప్రచారాలు, బూటకపు హామీలతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతులే బుద్ధి చెప్తారన్నారు. వరదలు, వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఇవ్వలేదన్నారు. అలాగే వానకాల సీజన్ ముగిసి పోయిన రైతుబంధు పథకం కింద పెట్టుబడి సహాయాన్ని అందించలేదన్నారు. అసలు యాసంగి పంటల సాగుకు పెట్టుబడి సహాయాన్ని ఇస్తారా లేదా అనేది ప్రభుత్వమే చెప్పాలన్నారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ప్రహ్లాద్, రోకండ్ల రమేష్, ఇజ్జగిరి నారాయణ, యాసంగి నర్సింగ్‌రావు, శ్రీనివాస్, ఆసీఫ్ తదితరులున్నారు.

నేడు ముథోల్‌కు ఎంపీ, ఎమ్మెల్యే రాక

ముథోల్, అక్టోబరు 8 : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌కు ఎంపీ గొడం నగేష్, ముథోల్ ఎమ్మెల్యే పవర్ రాంరావు పటేల్‌లు బుధవారం రానున్నట్లు ముథోల్ మండల బీజేపీ అధ్యక్షుడు కోరి పోతన్న ఒక ప్రకటనలో తెలిపారు. ముథోల్ నుంచి పంచగుడి వరకు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేయ నున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే బీజేపీ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి వారు హాజరవుతున్నట్లు చెప్పారు. మండలంలోని మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

నేడు అమ్మవారి మూల నక్షత్రం

● భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ● దేవస్థానంతో పాటు ప్రయివేటు గదులన్నీ ఫుల్
● గదులు దొరకక.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక ఇక్కట్లు ● నేడు తెల్లవారు జామున 2 గంటల నుంచి పూజలు ప్రారంభం

బాసర, అక్టోబర్, 8: బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో దసరా నవ రాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ప్రధానమైన మూల నక్షత్రం పర్వదినమైన బుధవారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి కాకుండా ఇతర సుదూర ప్రాంతాల నుండి మంగళవారం భక్తులు బాసర చేరుకున్నారు. దేవస్థానంతో పాటు ప్రైవేటు హోటల్స్, సత్రాలన్నీ భక్తులతో నిండిపోయాయి. గదులు దొరకక చాలా మంది భక్తులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ప్రత్యామ్నయ ఏర్పాటు లేక చాలా మంది తలదాచుకుందామంటే అవకాశం లేని పరిస్థితి. సుమారు 80 వేల మంది భక్తులు రావచ్చు అనే అంచనాలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఆలయానికి రెండు కిలో మీటర్ల ముందే మూడు, నాలుగు చోట్ల వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఆలయంతో పాటు గోదావరి నది స్నానఘట్టాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉదయం 2 గంటల నుంచే పూజలు

అమ్మవారి మూలనక్షత్రం అంటే అక్షర శ్రీకార పూజలకు ప్రసిద్ధి. ఈ పర్వదినాన తమ పిల్లలకు అక్షర శ్రీకారం జరిపించేందుకు భక్తులు వస్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉదయం 2 గంటల నుండే అక్షర శ్రీకార పూజలు ప్రారంభించేలా ఏర్పాట్లు చేశారు. ఇలా తొందరగా ప్రారంభం కావడం ఇదే మొదటి సారి. భక్తులకు క్యూలైన్‌లో వేచిఉండే సమయం తగ్గించడానికి ఇలా చేశారు.

వీఐపీ పూజలు రద్దు

మూలానక్షత్రం రోజు వీఐపీ పూజలు రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. ప్రముఖులు ఎవరు వచ్చినా, సిఫారసు లేఖలు తెచ్చిన ప్రత్యేక పూజలుండవు అని తేల్చిచెప్పారు. ప్రతి సారి వీఐపీల పేరిట అడ్డగోలుగా ప్రతీ ఒక్కరు పాసులు పొంది సాధారణ భక్తులకు ఇబ్బందులకు గురిచేసేవారు. అయితే అధికారుల రద్దు నిర్ణయం ప్రకటన వరకేనా లేదంటే ఎంత వరకు అమలు చేస్తారో వేచి చూడాలి.

కాత్యాయని రూపంలో అమ్మవారు

ఉత్సవాల్లో ఆరవ రోజు మంగళవారం సరస్వతీ అమ్మవారు కాత్యాయని రూపంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారికి అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. మంగళవారం సైతం భక్తుల రద్దీ కొనసాగింది. అమ్మవారిని దర్శించుకొని తమ పిల్లలకు అక్షర శ్రీకార పూజలు జరిపించుకున్నారు.


కాత్యాయని రూపంలో భక్తులకు దర్శన మిచ్చిన సరస్వతి అమ్మవారు

కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు


బతుకమ్మ వేడుకల్లో కోలాటాలు వేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్


బతుకమ్మను ఎత్తుకున్న జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్

నిర్మల్ అర్బన్, అక్టోబరు 8 : ప్రకృతికే అందం మన బతుకమ్మ సంబరమని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో గ్రామీణాభివృద్ధి సంస్థ, మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ బతుకమ్మకు పూజా కార్యక్రమం నిర్వమించి బతుకమ్మ పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా శాఖల మహిళా ఉద్యోగులందరితో కలిసి ఆటపాటలతో ఆడిపాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రకృతికే అందం మన బతుకమ్మ సంబరమని ఇలాంటి బతుకమ్మ పండుగను కలెక్టర్ కార్యాలయంలో జరుపుకోవడం సంతోషకంగా ఉందన్నారు. మహిళా ఉద్యోగులు ఆనందంగా ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని కలెక్టరేట్‌కు కొత్తశోభను తీసుకు వచ్చారని అన్నారు. జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, సీడీపీవో నాగమణి, డ్వాక్రా గ్రూప్ మహిళలు, ఇతర శాఖల అధికారులు, అన్ని శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మను గాజులతో అలంకరించిన దృశ్యం

వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు

● తర్లపాడ్‌లో అమ్మవారికి కరెన్సీ నోట్లతో అలంకరణ
● కడెం మండలం సారంగాపూర్‌లో ఘనంగా కుంకుమార్చన

ఖానాపూర్, అక్టోబరు 8 : ఖానాపూర్, కడెం మండలాల్లో శరన్నవరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఆరవ రోజు మంగళవారం దుర్గాదేవి మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్ గ్రామంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. మొత్తం భక్తుల నుంచి రూ.6 లక్షల పది వేలను పోగేసి అమ్మవారిని అలంకరించడంతో ధన లక్ష్మి రూపంలో దుర్గాదేవి భక్తులకు దర్శనం ఇచ్చింది. కడెం మండలం సారంగాపూర్ గ్రామంలో దుర్గాదేవి మండపం వద్ద భక్తులు ఘనంగా కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు మండలాల్లో శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా భక్తులు ప్రత్యేకపూజలతో అమ్మవారి మండపాలు కిటకిటలాడుతున్నాయి.


తర్లపాడ్‌లో కరెన్సీ నోట్ల అలంకరణతో అమ్మవారు

లక్ష్మీదేవిగా భాగ్యనగర్ దుర్గ దర్శనం



నిర్మల్ కల్చరల్, అక్టోబరు 8 : భాగ్యనగర్ ఆలయంలో దుర్గా నవరాత్రుల సందర్భంగా అమ్మవారు లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మ వారికి డబ్బుల దండ వేసి పూజలు చేశారు. లక్ష్మీ ప్రతీక సతీష్, అయిటి హర్షిత, భక్తులు పాల్గొన్నారు.

దస్తురాబాద్‌లో ఘనంగా కుంకుమార్చన


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

దస్తురాబాద్, అక్టోబరు 8 : దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా మండల కేంద్రంలోని శివనాట్య మండలి యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహం వద్ద మంగళవారం కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు


కుంటాలలో దుర్గామాత వద్ద పూజలు

కుంటాల, అక్టోబర్, 8 : కుంటాల మండలంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గత గురువారం ప్రారంభమైన ఉత్సవాలు మండలంలోని అన్ని గ్రామాలలో అంగరంగవైభవంగా కొనసాగుతున్నాయి. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేకపూజలు నిర్వహిస్తూ అమ్మవారికి ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పిస్తూ రాత్రి వేళల్లో భజన, కోలాటం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

వీహెచ్‌పీ భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆయుధపూజ


ఆయుధపూజలో పాల్గొన్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ప్రతినిధులు

భైంసా, అక్టోబరు 8 : పట్టణంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని దుర్గామాత మండలి వద్ద మంగళవారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ శ్రేణులు ఆయుధపూజ కార్యక్రమాన్ని చేపట్టాయి, నవరాత్రి వేడుకలలో భాగంగా దుర్గామాత విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేపట్టిన అనంతరం ఆయుద పూజను నిర్వహించారు. ఇందులో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు గుజ్జల్‌వార్ వెంకటేష్, సహ కార్యదర్శి పెరుగు నవీన్, భైంసా పట్టణ ప్రధాన కార్యదర్శి శివకుమార్ (మారుతి), ఉపాధ్యక్షులు డి.రాజేందర్, రంగు శ్రీను, ప్రతినిధి తూమోల్ల దత్తు, భజరంగ్ దళ్ సేవా ప్రముఖ్ రాందాస్, గోసేవా ప్రముఖ్ దత్తాత్రిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి చాలా గొప్పది

లక్ష్మణచాంద, అక్టోబరు 8 : భారతీయ సంస్కృతి చాలా గొప్పదని భారతీయ జనతాపార్టీ జిల్లా నాయకులు అయిండ్ల భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలో పర్యటించిన ఆయన ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు స్వర్ణారెడ్డితో కలిసి మునిపెల్లి గ్రామంలోని దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భారీ సంఖ్యలో మహిళలు, నాయకులు అడ్వాల రమేష్, భీమ్‌రెడ్డి, రాంపెల్లి రమేష్, విగ్రహదాత అయిండ్ల కళావతిరెడ్డి, గ్రామస్థులు మేదరి భూమేష్, వినోద్, రాము, తదితరులు ఉన్నారు.

వడ్లకు రూ.500 బోనస్‌గా అందివ్వాలి

● బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయకర్త డా. కిరణ్ కోమ్రేవార్

భైంసా, అక్టోబరు 8 : రైతన్నలు పండించిన అన్ని రకాల వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్‌గా అందివ్వాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయకర్త డా. కిరణ్ కోమ్రేవార్ డిమాండ్ చేశారు. మంగళవారం భైంసాలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా క్వింటాలు వడ్లకు రూ.500 బోనస్‌గా అందిస్తామని హామీనిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ ప్రస్తుతం కేవలం సన్న రకపు వడ్లకే బోనస్ అందిస్తామని ప్రకటించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని దుయ్యబట్టారు. రైతుబంధు, రుణమాఫీ విషయాల్లో ప్రభుత్వం మోసపూరిత విధానాలకు పాల్పడిందని విమర్శించారు. ప్రభుత్వం తీరుతో రైతన్న కష్టనష్టాల పాలవుతున్నారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లోని ఆంక్షల మూలంగా రైతులు అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం తీరును మార్చుకొని అన్ని రకాల వడ్లకు బోనస్‌గా రూ.500 అందించాలన్నారు. రైతులందరీ రుణాలను మాఫీ చేయాలన్నారు. లేని పక్షంలో పార్టీ ఆద్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పారిశుధ్య మెరుగుదలకు
వ్యాపారులు సహకరించాలి


వ్యాపారులతో మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్

భైంసా, అక్టోబరు 8 : పట్టణ పరిధిలోని వ్యాపారస్థులు పారిశుద్య వ్యవస్థ మెరుగుదలకు బాధ్యతాయుతంగా సహకరించాలని భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్ సూచించారు. మంగళవారం పట్టణ పరిధిలోని వ్యాపార సముదాయ ప్రాంతాల్లో పర్యటించి వ్యాపారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి వ్యాపారి తమ దుకాణాల్లో డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. తమ వ్యాపార సంస్థలోని చెత్తతో పాటు ఇతర వ్యర్థాలు తదితర వాటిని రోడ్డుపై పారవేయకుండా డస్ట్‌బిన్‌లో వేయాలన్నారు. ఇక నుంచి ప్రతి నిత్యం రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు చెత్త సేకరణ కోసం మున్సిపల్ ఆటో ప్రతి వ్యాపార సంస్థ వద్దకు వస్తుందన్నారు. డస్ట్‌బిన్‌లోనున్న చెత్తతో పాటు ఇతర వ్యర్థాలు సేకరిస్తుందన్నారు. ఇందుకు వ్యాపారస్తులందరూ సహకరించి పారిశుధ్య సమస్యలు ఏర్పడకుండా సహకరించాలని పేర్కొన్నారు. ఇందులో మున్సిపల్ మేనేజర్ గౌరీష్ కుమార్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ అనీస్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

తడి.. పొడి చెత్త వేరువేరుగా సేకరించాలి


ముథోల్, అక్టోబరు 8 : గ్రామాల్లో ప్రతి రోజు తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని ఎంపీడీవో శివకుమార్ సూచించారు. మంగళవారం మండలాభివృద్ధి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖచ్చితంగా పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. అలాగే ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సలహా, సూచనలు ఇచ్చారు. ఈ కార్య క్రమంలో పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

కుభీర్, అక్టోబరు 8 : పారిశుధ్య వ్యవస్థను మెరుగు పరచాలని ఎంపీడీవో నవనీత్‌కుమార్ అన్నారు.మంగళవారం మండలంలోని బ్రహ్మేశ్వర్ తండా, వీరేగాం తాండాలలో చేపడుతున్న పారిశుధ్య పనులను మంగళవారం ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని మురికి కాలువలను శుభ్రపరిచి నీటి వనరుల వద్ద మురికి నీరు చేరకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి హరీష్‌కు సూచించారు. గ్రామస్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు.

ఆధ్యాత్మికతతో వ్యవహరిస్తూ
ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

భైంసా, అక్టోబరు 8 : భక్తిభావాలు పెంపొందించుకుంటూ ఆధ్యాత్మికతో వ్యవహరిస్తూ తమ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వాలని పతాంజలి మహిళా యోగా సమితి ప్రభారి శోభా మాందాని, భారత్ స్వాభిమాన్ ప్రభారి గణపతి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని మహాలక్ష్మీ, పోచమ్మ ఆలయాల ప్రాంగణంలో పతంజలి యోగా సమితి, భారత స్వాభిమాన్‌ల ఆధ్వర్యంలో చేపట్టిన యజ్ఞంలో పాల్గొని మాట్లాడారు. ఆపద సమయాల్లో కాకుండా అన్ని సమయాల్లోనూ ఆలయాల సందర్శన చేపట్టాలన్నారు. భక్తి భావాలతో మెలగాలని పేర్కొన్నారు. ఆధ్యాత్మికతో వ్యవహరిస్తే అన్నింటా సత్ఫలితాలే ఉంటాయన్నారు. యజ్ఞయాగాదుల నిర్వాహణతో ప్రయోజనాలెన్నో ఉన్నాయన్నారు. ప్రతి మహిళ సమాజ సేవకు తమ వంతు భాగస్వామ్యాన్ని అందిస్తూ ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. స్వీయరక్షణ చర్యలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు.ఇందులో పట్టణ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.2 : కనిష్ఠం 23.6

నిర్మల్
జిల్లా వార్తలు
10
బుధవారం 9 అక్టోబరు 2024

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నర్సాపూర్(జి), అక్టోబరు 8 : మండల కేంద్రంతో పాటు అంజనీ తండా, గొల్లమాడ గ్రామాల్లో మంగళవారం డ్రైడే నిర్వహించారు. డీపీవో పోతకోటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మంగళ వారం, శుక్రవారం గ్రామంలో ఫ్రై డే డ్రై డే నిర్వహించి ప్రజలకు పరి శుభ్రతపై అవగాహన కల్పిస్తు న్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో తిరుపతి రెడ్డి, ఆశా వర్కర్లు, ఏఎన్ ఎంలు, పంచాయతీ కార్యదర్శులు రాథోడ్ కైలాష్, సంస్కృతి, ఉపాధి హామీ సిబ్బంది విఠల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టులపై నజర్



- అధికార కాంగ్రెస్ పార్టీలో పదవుల కోలాహలం
- ఆశావహుల ఎదురు చూపులు
- ఐదు మార్కెట్ కమిటీలకు నేడో రేపో పాలకవర్గాల ఖరారు
- సీనియర్‌లకు పెద్దపీట
- దేవాలయాల పాలకవర్గాలూ త్వరలోనే ఖరారు

నిర్మల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నామినేటెడ్ పదవుల కోలాహలం మొదలైంది. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన చాలా మంది సీనియర్ నాయకులు, కార్య కర్తలు గత తొమ్మిది నెలల నుంచి నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. వారి ఆశలు కొద్దిరోజుల్లోనే ఫ లించబోతున్నాయి. జిల్లాలోని ఐదు మార్కెట్ కమిటీలకు చైర్మన్ పదవులతో పాటు వైస్‌చైర్మన్, డైరెక్టర్ పదవుల కోసం చాలా మంది సీనియర్ నేతలు ఆశలు పెట్టుకున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆయా నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జీలు సిఫారసు చేసిన వారికే పదవులు ఇవ్వాలని నిర్ణయించడంతో ఆశావహులంతా తమ ఇన్‌చార్జీల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఇప్పటికే నియోజకవర్గ ఇన్‌చార్జీలు తమ పరిధిలోని మార్కెట్ కమిటీల పాలకవర్గాలకు సంబంధించిన పేర్లను సంబంధిత మంత్రి ద్వారా వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు అందించారు. రెండు, మూడురోజుల్లో జిల్లాలోని ఐదు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ పదవుల పేర్లు ఖరారు కాబోతున్నాయి. దీంతో పాటు ఇప్పటికే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు అర్జుమన్‌ను నియమించారు. అలాగే నిర్మల్ పట్టణంలోని చారిత్రక మహలక్ష్మి కమిటీ చైర్మన్‌గా కొడుకుల శ్రీకాంత్‌ను నియమించారు. అయితే ప్రసిద్ధి గాంచిన అడెల్లి పోచమ్మ ఆలయ పాలకవర్గం నియామకంతో పాటు దేవరకోట వెంకటేశ్వరస్వామి ఆలయ పాలకవర్గంను నియమించబోతున్నారు. ఇప్పటికే ఈ నియామకాలకు సంబంధించిన జాబితా సంబంధితశాఖ అనుమతి కోసం పంపారు. దసరాలోగా ఈ జాబితాను సంబంధిత శాఖ అధికారులు ఆమోదించడమే కాకుండా నియమాలకు సంబంధించి ఉత్తర్వులు వెలువరించనున్నారు. అయి తే ఇటీవలే ఇన్‌చార్జీలు పంపిన జాబితాల్లో స్థానిక నేతల ఒత్తిళ్ల మేరకు కొన్ని మార్పులు చేర్పులు కూడా జరిగా యన్న ప్రచారంతో పదవులను ఆశిస్తున్న ఆశావాహులు టెన్షన్‌కు గురవుతున్నారు.


కుభీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఇదే

మార్కెట్ కమిటీలకు పోటాపోటీ

కాగా జిల్లాలోని ఐదు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలంతా తీవ్రంగా పోటీ పడుతుండడంతో నియామకాల వ్యవహారం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై ఉత్కంఠ కొనసాగుతోంది. పార్టీ సీనియర్ నాయకులు డీసీసీ చైర్మన్ శ్రీహరి రావుకు అత్యంత సన్నిహితుడైన మేడిపెల్లి భీంరెడ్డి పేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఖరారైనట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జీ అయిన డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు నిర్మల్‌తో పాటు సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులతో పాటు వైస్ చైర్మన్, డైరెక్టర్ పదవులకు సంబంధించిన పేర్ల జాబితాను అధిష్టానానికి పంపినట్లు చెబుతున్నారు. సంబంధిత వ్యవసాయ మార్కెట్ శాఖ మంత్రి కూడా ఈ జాబితాకు ఆమోదం తెలపడమే కాకుండా ని యామక ఉత్తర్వులు జారీ చేయాలంటూ ఆదేశించినట్లు సమాచారం. నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిపెల్లి భీంరెడ్డి నియామకం కాబోతుండడమే కాకుండా వైస్ చైర్మ న్‌గా లక్ష్మణచాంద మండలానికి చెందిన ఈటె ల శ్రీనివాస్ నియామకం ఖరారైనట్లు చెబుతున్నారు. అలాగే డైరెక్టర్‌లు కూడా ఇప్పటికే ఖరారయ్యారు. సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సీనియర్ నాయకులు ఆది, దశరథ రాజేశ్వర్‌లకు కట్టబెట్టను న్నట్లు సమాచారం. ఇప్పటికే ఆదితో పాటు వైస్‌చైర్మన్, డైరెక్టర్‌ల పేర్లను కూడా ఖరారు చేశారంటున్నారు. కాగా ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం చాలా మంది సీనియర్ నాయకుల పోటీ పడుతున్నారు. అయితే అక్కడి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సూచించిన వారికే చైర్మన్ పదవితో పాటు వైస్ చైర్మన్, డైరెక్టర్ పదవులు దక్కనున్నా యి. ఇప్పటికే ఇక్కడి జాబితాను కూడా సంబంధిత శాఖకు చేరుకుందని అంటున్నారు. వీటితో పాటు ముథోల్ నియోజకవర్గంలోని భైంసా, కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు కూడా తీవ్రమైన పోటీ నెలకొందని చెబుతున్నారు. అయితే ఇక్కడి నియోజకవర్గ ఇంచార్జీ నారాయణ రావు పటేల్ భైంసా, కుభీర్ మార్కెట్ కమిటీ పాలకవర్గాలకు సంబంధించి పేర్ల జాబితాను అధిష్టానానికి పంపించడమే కాకుండా ఆ జాబితాకు ఆమోదం ముద్ర కూడా వేయించినట్లు చెబుతున్నారు.

దేవాలయాల పాలకవర్గాలకు సైతం

జిల్లాలోని చారిత్రక అడెల్లి పోచమ్మ ఆలయం పాలక వర్గాలకు సంబంధించి నియామక పత్రిక కూడా ఒకటి రెండు రోజుల్లో ఖరారు కానుందని చెబుతున్నారు. ఇప్పటికే మహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్‌గా శ్రీకాంత్‌ను నియమించగా దేవరకోట శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా కొడుకుల శ్రీనివాస్ నియామకం దాదాపుగా ఖరారైనట్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇది వరకే దేవరకోట ఆలయ చైర్మన్‌గా పని చేసిన ఆమెడ శ్రీధర్‌కు రెండోసారి కూడా చైర్మన్ పదవిని కట్టబెట్టను న్నట్లు విశ్వసనీయ సమాచారం. అదే విధంగా ఆలయ కమిటీకి సంబంధించి డైరెక్టర్ పేర్లను కూడా ఖరారు చేశారు. కాల్వ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ, కదిలి పాపహరేశ్వరస్వామి ఆలయ కమిటీల నియామకాలు కూడా కొద్ది రోజుల్లోనే పూర్తికానున్నాయంటున్నారు. మొత్తానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలకే పదవుల నజరానాలు అందబోతున్నాయి.


మెడిసిన్ ర్యాంకర్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి ఐకే రెడ్డి

మెడిసిన్ ర్యాంకర్‌కు సన్మానం

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 8 : పట్టణంలోని గాంధీ చౌక్ ప్రాంతానికి చెందిన తాండ్ర గాయత్రి సుగుణాకర్‌ల కుమారుడు సదానంద్ ఆల్ ఇండియా మెడికల్ ఎంట్రెన్స్‌లో 8వ ర్యాంక్ సాధించి గాంధీ మెడికల్ కళాశాలలో సీటు పొందాడు. ఈ సందర్భంగా సదానంద్‌ను మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఘనంగా సన్మానించారు. పేద కుటుంబం నుంచి దేశంలో ఉన్నత ర్యాంక్ సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మేడారం అపర్ణ ప్రదీప్, నాయకులు ధర్మాజీ రాజేందర్, ఆమెడ శ్రీధర్, అనిల్, కొప్పుల శ్రీధర్, తదితరులు కూడా పాల్గొని అభినందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలో

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 8 : పట్టభద్రులు ఎన్నికలో పాల్గొనేలా అర్హులైన అభ్యర్థులకు అవగాహన కల్పించాలని ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఎన్నికలు జరుగనున్న ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనేలా ఓటరు నమోదు చేపట్టాలన్నారు. పట్టభద్రుల ఓటు హక్కు నమోదుకు నవంబరు 6 వరకు చివరి గడువన్నారు. గతంలో ఓటు వేసిన వారు కూడా తిరిగి నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. పట్టభద్రులందరినీ ఓటు నమోదు చేసుకునేలా చేస్తామన్నారు. ఆర్డీవో రత్నకళ్యాణి, అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

పట్టణంలో బీజేపీ సంబురాలు

- హర్యానాలో విజయంపై పార్టీ నేతల హర్షం

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 8 : హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం జిల్లాకేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచి నృత్యాలు చేశారు. హర్యానాలో మూడోసారి విజయం సాధించడం మోదీ గ్రాఫ్ తగ్గలేదనడానికి నిదర్శనమని ఆ పార్టీ నాయకుడు రావుల రాంనాథ్ అన్నారు. జమ్మూ కశ్మీర్‌లోనూ బీజేపీ అధిక సీట్లు సాధించిందన్నారు. ఈ సంబురాల్లో పార్టీ నాయకులు నరేష్, కే.శ్రీనివాస్‌రావు, నర్సయ్యతో పాటు పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


పట్టణంలో మిఠాయిలు పంచుకుంటూ సంబురాల్లో నాయకులు

ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

- వానాకాలం సీజన్ నుంచే సన్నరకానికి రూ. 500ల బోనస్
- కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించాలి
- కలెక్టర్ అభిలాష అభినవ్


సమావేశానికి హాజరైన అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, అక్టోబరు 8 : ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లు, కేంద్రాల ఏర్పాట్లకు చేపట్టవలసిన చర్యలు, కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ (రెవెన్యూ)తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. త్వరలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, కేంద్రాలలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లను కల్పించాలన్నారు. ఈ వానకాలం నుంచే ప్రభుత్వం సన్నరకం ధాన్యంకు రూ. 500ల బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వ బోనస్‌పై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సన్న, దొడ్డురకాలకు ధాన్యం కేంద్రాలను వేరువేరుగా ఏర్పాటు చేయాలని, సన్న రకపు ధాన్యపు బస్తాలపై కొనుగోలు కేంద్రానికి సంబంధించిన వివరాలను ముద్రించాలని సూచించారు. మిల్లింగ్‌లో ఇబ్బందులు తలెత్తకుండా సన్న, దొడ్డు రకం ధాన్యపు బస్తాలను వేరువేరు మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కేంద్రాల్లో ధాన్యం మద్దతు ధర, నిర్వాహకుల సమాచారం, తదితర అంశాల పూర్తి వివరాలు రైతులకు తెలిసేలా ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరిపడినన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తాగునీరు, టెంటు, రాత్రివేళల్లో విద్యుత్ లైటింగ్ సదుపాయాలు కల్పించాలన్నారు. నిర్వాహకులు కేంద్రాల వద్ద అవసరమైన హమాలీలు, సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. ప్యాడీ క్లీనింగ్ యంత్రాల ద్వారా ధాన్యం శుభ్రపరిచే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని, ప్రతి కేంద్రంలో తూకపు, తేమ, ప్యాడీ క్లీనింగ్ యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తూకపు యంత్రాలకు స్టాంపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోళ్లకు సంబంధించి రోజువారీ వివరాలను సంబంధిత రిజిస్టర్‌లలో నమోదు చేయాలని సూచించారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం అక్రమ రవాణా జరగకుండా అంతర్‌రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేయడంతో పాటు మొబైల్ చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మిల్లర్లు మిల్లింగ్ ప్రక్రియలో అలసత్వం వహించకుండా త్వరితగతిన మిల్లింగ్‌ను పూర్తి చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం వేణు గోపాల్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, అధికారులు, మిల్లర్లు, లారీ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సామాజిక ముఖచిత్రం పుస్తకం ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 8 : తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సామాజిక ముఖచిత్రం 2024 పుస్తకాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం ఆవిష్కరించారు. ముఖ్యప్రణాళిక అధికారి జీవరత్నం, అధికారులు పాల్గొన్నారు.

తెల్లారిందే మొదలు మందుబాబులకు కిక్కు

- ఖానాపూర్‌లో ఉదయం 8 గంటలకే తెరుచుకుంటున్న బార్
- నిబంధనలకు తూట్లు పొడిచి ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలు
- విచ్చల విడిగా బయటకు మద్యం విక్రయం
- ఇళ్ల మధ్యలో ఉండడంతో ఇబ్బంది పడుతున్నామంటున్న స్థానికులు


మంగళవారం ఉదయం 9:16 గంటలకే బార్‌లో మద్యం తాగుతున్న దృశ్యం


నిబంధనలు ఉల్లంఘించి ఉదయం 9:16 గంటలకు మద్యం విక్రయిస్తున్న దృశ్యం

ఖానాపూర్, అక్టోబరు 8 : తెల్లవారడమే ఆలస్యం మందు బాబులకు కిక్కు ఎక్కించడమే లక్ష్యంగా ఖానాపూర్‌లోని బార్‌లో అమ్మకాలు సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు బార్‌లో సిట్టింగ్‌కు అనుమతి ఉందని అధికారులు చెబుతున్నారు. కానీ తెల్లవారిందే మొదలు ఖానాపూర్‌లోని బార్ తెరిచి మద్యం విక్రయాలు సాగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదేమని అడిగితే బార్‌లో క్లీనింగ్ చేసుకునేందుకు ఓపెన్ చేశామని చెబుతున్న నిర్వాహకులు దర్జాగా మందుబాబులకు మాత్రం ఎనిమిది గంటల నుండే మద్యం విక్రయిస్తూ నిత్యం కిక్కు ఎక్కిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మరోపక్క రాత్రివేళల్లో సైతం 12 గంటల వరకు బార్ నిర్వహణ సాగుతోందని స్థానికులు చెబుతున్నారు. వైన్స్‌లను తలపించేలా మద్యం బాటిళ్లను బయటకి విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. బార్ నుండి మద్యం బాటిళ్లను బయటకు విక్రయించకూడదని, బార్‌లో సిట్టింగ్ సైతం ఖచ్చితంగా ప్రభుత్వం నిర్ణయించిన సమయాల్లోనే నిర్వహించాలనే నిబంధనలు ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇంత జరుగుతున్న పర్యవేక్షణ చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు మాత్రం 'మామూలు'గా తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖానాపూర్‌లో ఉన్న బార్ ఇళ్ల మధ్యలో ఉండడంతో ఇలా తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు మందు బాబుల రాకపోకలతో ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే బార్‌లో నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలని లేని పక్షంలో ఇళ్ల మధ్యలో ఉన్న బార్‌ను పట్టణ శివారు ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తనిఖీలు నిర్వహించి చర్యలు చేపడతాం : ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌రావు

ఖానాపూర్‌లోని బార్‌లో సమయ పాలన పాటించడం లేదని ఇదివరకే పలువురు ఫోన్ ద్వారా తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించవద్దని నిర్వాహకులకు గతంలో సైతం తెలిపాం. పదే పదే చెబుతున్న తీరు మార్చుకోకపోతే ఆకస్మిక తనిఖీలు నిర్వహించి శాఖాపరమైన చర్యలు చేపడతాం.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 8 : మరమ్మతుల దృష్ట్యా బుధవారం నిర్మల్‌లోని ఇందిరానగర్, గొల్లపేట, శాస్త్రి నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుండి 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని మంగళవారం అధికారులు తెలిపారు.

కారు ఢీకొట్టడంతో మహిళ మృతి

సోన్, అక్టోబరు 8 : మండలంలోని గంజాల్ గ్రామంలో గేదెలను మేపుతూ జీవిస్తున్న హనుమవ్వ(48) అనే మహిళకు కారు ఢీకొట్టడం మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే మంగళవారం హనుమవ్వ గేదెలను మేపుతూ ఉండగా ఉదయం 10:30 గంటలకు గంజాల్ గ్రామ ప్రక్కన ఎన్‌హెచ్-44 రోడ్డుకు కొద్ది దూరంలో ఆర్మూర్ వైపు నుండి నిర్మల్ వెళ్తున్న ఎంహెచ్ 29 ఆర్ 3482 అనే నెంబర్ గల కారు డ్రైవర్ కారును అతివేగంగా అజాగ్రత్తగా నడిపి మృతురాలిని ఢీకొట్టాడు. మృతురాలికి నడుము, ఎడమ చేయి, ఎడమ కాలుకు బలమైన గాయాలయ్యాయి. ఆమెను నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఉదయం 11 గంటల ప్రాంతంలో మరణించింది. మృతురాలి కూతురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోన్ ఏఎస్సై భూమేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది.

8 టన్నుల బెల్లం, 8 క్వింటాళ్ల పటిక పట్టివేత


బెల్లం స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

పెంబి, అక్టోబరు 8 : పెంబి మండల కేంద్రంలో మంగళవారం ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలో పెంబి మండల కేంద్రంలోని రాజేందర్ దుకాణంలో సోదాలు నిర్వహించి, నిల్వ ఉంచిన 8 టన్నుల నల్ల బెల్లం, 8 క్వింటాళ్ల పటికను స్వాధీనం చేసుకున్నారు. షాప్ యజమాని రాజేందర్‌పై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఆబ్కారీ శాఖ అధికారి తెలిపారు. అక్రమంగా బెల్లంను, పటికను విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు గంగారెడ్డి, లక్ష్మణ రావు, ఎస్సైలు వసంతరావు, గజేందర్ ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల

సమస్యలు పరిష్కరించండి

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 8 : నిర్మల్ మున్సిపల్ కార్మికుల సమస్యను పరిష్కరించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ నజీరుద్దీన్ కోరారు. మంగళవారం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. గత నాలుగు నెలలుగా జీతాలు అందకపోవడంతో సమ్మె చేస్తున్నారని తద్వారా పట్టణంలో చెత్త పేరుకుపోతోందని తెలిపారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే తగు చర్య తీసుకోవాలని కోరారు.

..సమ్మెకు సీపీఎం మద్దతు

నిర్మల్‌లో పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ సమ్మె చేస్తున్న కార్మికులకు సీపీఎం తమ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మంగళవారం ధర్నా శిబిరం సందర్శించి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం నూతన్ కుమార్ మాట్లాడుతూ.. కార్మికుల న్యాయమైన సమస్యను పరిష్కరించి ఇబ్బందులు తొలగించాలని కోరారు.